క్లుప్తంగా

సైక్లింగ్.. ఆరోగ్యానికి మేలు

మంచాల(చేబ్రోలు): ప్రతి రోజు సైక్లింగ్ చేయటం వల్ల ఆరోగ్యానికి మేలు చేకుర్చుతుందని మంచాల గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మంచాల గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సిబ్బంది గ్రామ సచివాలయం వద్ద మంగళవారం సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వృద్ధులు, గ్రామస్తులు, అధికారులు, సిబ్బందితో ప్రధాన రహదారుల్లో సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. సచివాలయం వద్ద జరిగిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది మాట్లాడుతూ సైకిల్ తొక్కటం వల్ల ఒత్తిడి తగ్గి, రక్తపోటు నియంత్రణలో ఉంటుందన్నారు. ఎంసీహెచ్‌పీ వి.కల్యాణ్, ఏఎన్‌ఎం కె.సుజాత, వి.హేమకుమారి, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాకుమాను: మండలంలోని గరికపాడు, కొండపాటూరు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసీడీఎస్ కాకుమాను సెక్టార్ సూపర్ వైజర్ పోసమ్మ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గరికపాడు ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్త, కొండ పాటూరు ఓసీ సెంటర్ సహాయకురాలి పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన, 21–35 మధ్య వయస్సు గల వారు అర్హులని వెల్లడించారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన తల్లి, కూతురు

పెదనందిపాడు : తల్లి, కూతురు కనపించకుండా పోయారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అద్బుల్ రెహమాన్ మంగళవారం తెలిపారు. పెదనందిపాడు గ్రామానికి చెందిన కవిల సుమలత కుటుంబ కలహాల నేపథ్యంలో తన పదేళ్ల కుమార్తె అమూల్యను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. సుమలత తల్లి ఆరీపు ఝాన్సీ రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదనందిపాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుడి మృతి

మేడికొండూరు: విధి నిర్వహణలో ఉండగా అనారోగ్యానికి గురైన ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని పేరేచర్లలో ఒక స్టోన్ క్రషర్‌లో మంగళవారం జరిగింది. పేరేచర్ల సమీపంలోని విజయకాటన్ కాలనీకి చెందిన పి.సుబ్బారావు(42) పేరేచర్లలోని ఒక స్టోన్ క్రషర్‌లో పనిచేస్తుంటాడు. రోజు మాదిరిగానే మంగళవారం విధులకు హాజరయ్యారు. ఒక్కసారిగా కళ్లు తిరిగి కిందపడిపోయాడు. అతనిని తోటి కార్మికులు గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే చర్యలు



తెనాలిఅర్బన్: 120 మైక్రాన్‌ల తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, వస్తువులను విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల హెచ్చరించారు. ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో పట్టణంలోని వ్యాపారులకు మంగళవారం ఆమె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూట్, క్లాత్ బ్యాగ్‌లను అందరూ ఉపయోగించాలని సూచించారు. వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, సిబ్బంది ఉన్నారు.

కార్మికుడు అదృశ్యంపై కేసు..

తెనాలి రూరల్: కార్మికుడు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన పసుపులేటి సుధాకర్ కూలి పనులకు వెళుతుంటాడు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య నాగేశ్వరి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్‌ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

తమ్ముడిపై అక్క దాడి

తెనాలి రూరల్: మద్యం సేవించి వచ్చి వేధిస్తున్న తమ్ముడిపై అక్క రాయితో దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన ఆదిత్య సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చి అతని అక్క ఆషాతో ఘర్షణ పడి వేధించసాగాడు. దీంతో ఆమె రాయితో అతనిపై దాడి చేయగా గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు మంగళవారం నమోదు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

సాంకేతికతను అందిపుచ్చుకోండి

తెనాలిఅర్బన్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం వస్తున్న మార్పులను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ సూచించారు. ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచుకునేందుకు దోహదపడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామారావు మాట్లాడుతూ సాంకేతిక విద్య మరింత విస్తరించనున్నదని చెప్పారు. డాక్టర్ కె.కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న సుపరిపాలన

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- చేబ్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. చేబ్రోలు–4 గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కిలారి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్ అందజేశారు. ముట్లూరు రోడ్డు, చీలిపాలెం, పాతరెడ్డిపాలెం దళితవాడలో అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. చీలిపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానికులు డ్రైనేజీ, విద్యుత్, రోడ్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి వెంటనే పరిష్కరించనున్నట్లు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా అమలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ప్రజల ఆశీస్సులు, దీవెనలు జగనన్నకు కొండంత బలమని, టీడీపీ కుట్ర, స్వార్థ రాజకీయాలను గమనించాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు విన్నవించిన కొన్ని సమస్యలను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బి.అనూరాధ, ఎంపీపీ కె.సాహితీ, వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, సర్పంచ్ అత్తోట వినీతారాణి, గమనీడు నాగేంద్రుడు, పెనుమోలు రాజేష్, కె.కిరణ్‌కుమార్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి వైపీఏ ప్రసాద్, మండలస్థాయి అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు



పెదకాకాని శ్రీ భ్రమరాంబ అమ్మవారు



శ్రీ మల్లేశ్వరస్వామి వారి మూలవిరాట్

కల్యాణ బ్రహ్మోత్సవాలకు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయం ముస్తాబు

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం నుంచి మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే శివాలయంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయమంతా పందిళ్లతో తీర్చిదిద్దారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా స్వామివారిని దర్శించుకునే విధంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరిస్తున్నారు. ఈ నెల 22వ తేదీ వరకూ ఏడు రోజుల పాటు అంగరంగ వైభవంగా, శాస్త్రోక్తంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ప్రత్యేక పూజలు..హోమాలు

పెదకాకాని శివాలయంలో యజ్ఞాల బావి నీటితో స్నానాలు, ప్రభలతో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకోవడం, అంతరాలయ అభిషేకాలు, ఏకవారాభిషేక పూజలు, తలనీలాలు, అన్న ప్రాసనలు, చెవి పోగులు కుట్టించుట, వాహన పూజలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. రాష్ట్రంలోనే ప్రత్యేకంగా చెప్పుకోదగిన రాహుకేతువు పూజలు అత్యంత ప్రాచుర్యం పొందినవి. ప్రతినిత్యం నవగ్రహ పూజలు, దేవస్థాన యాగశాల నందు గణపతి, నవగ్రహ, నిత్య రుద్ర, సుబ్రహ్మణ్య, చండీ, పాశుపత హోమాలు, శాంతి కళ్యాణం జరుపుట ద్వారా సకల దోష నివారణ, సర్వకార్యసిద్ధి కలుగుతుందని ఆలయ స్థానాచార్యులు సాంబశివరావు తెలియజేశారు.



పెదకాకాని శివాలయం

మాజీ కబడ్డీ ప్లేయర్ మృతి

తెలగాయపాలెం(కాకుమాను): మండలంలోని తెలగాయపాలేనికి చెందిన మాజీ రాష్ట్ర స్థాయి కబడ్డీ ప్లేయర్ మువ్వ శ్రీమన్నారాయణ(57) సోమవారం విశాఖపట్నంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన 25 సంవత్సరాల క్రితం రాష్ట్ర కబడ్డీ జట్టులో సభ్యుడిగా ఉండి జట్టును విజయపథంలో నడిపించారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి విశాఖపట్నంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ.. మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం స్వగ్రామం తెలగాయపాలెంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

క్రీడలపై ఆసక్తి అవసరం

తెనాలి ఆర్డీఓ రాఘవరావు



తెనాలిఅర్బన్: క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని తెనాలి ఆర్డీఓ టి.రాఘవరావు సూచించారు. బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అంతర్‌విభాగ ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. నేటి యువత విద్యకు ప్రాధాన్యత ఇస్తూ పూర్తిగా క్రీడలను విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో క్రీడలను ప్రతి రోజు నిర్వహించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాము, హృదయరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంస్థ, వ్యక్తిగత అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలి



ఉద్యోగాలు పొందినవారిని అభినందిస్తున్న వీసీ రాజశేఖర్, పక్కన రిజిస్ట్రార్ కరుణ

ఏఎన్‌యూ: ఉద్యోగం చేసే సంస్థ, వ్యక్తిగత అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేయాలని ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 8న జరిగిన క్యాంపస్ డ్రైవ్‌లో ఇసుజు మోటార్స్ సంస్థ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 136 మంది ఫైనల్ ఇంటర్వ్యూకి అర్హత సాధించారు. వారిలో ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 54 మంది ఉద్యోగాలు సాధించారు. వీరిని మంగళవారం వీసీ అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత ఉన్నత ఉపాధి అవకాశాలు సాధించే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య, డీన్ ఆచార్య ఇ.శ్రీనివాసరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ తౌసీఫ్, అధ్యాపకులు డాక్టర్ ఎం.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూని సందర్శించిన ఆర్.నారాయణమూర్తి..

సినీ దర్శకుడు, రచయిత, నటుడు ఆర్.నారాయణమూర్తి ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తాను యూనివర్సిటీ అనే సినిమాను తీశానని దానిలో ప్రొఫెసర్ పాత్ర వేశానని నారాయణమూర్తి వీసీకి తెలిపారు. ఆ సినిమా పాటలను వచ్చే నెలలో ఏఎన్‌యూలో విడుదల చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ, కళారంగాలకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు కొద్దిసేపు చర్చించారు. నారాయణమూర్తిని వీసీ సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు..

నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ స్వరూపరాణి అన్నారు. యూనివర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'వయెలెన్స్: యాన్ ఇంపిడిమెంట్ టూ ఉమెన్ ఎంపవర్‌మెంట్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య స్వరూపరాణి ప్రసంగించారు. బాధితులకు నష్టపరిహారంగా డబ్బులు ఇవ్వడం ఒక్కడే పరిష్కారమార్గం కాదన్నారు. సదస్సులో పరిశోధనా పత్రాలు మర్పించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ కేవీ శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు

నీతి నిజాయతీకి నిలువుటద్దం.. తనబుద్దు కృష్ణారెడ్డి

- పార్థివ దేహానికి ఘన నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ నేతలు
- జన సందోహం మధ్య అంతిమయాత్ర



గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ వీరాభిమాని తనబుద్దు కృష్ణారెడ్డి(54) నీతి నిజాయతీకి నిలువుటద్దం అని వైఎస్సార్ సీపీ నేతలు మంగళవారం నివాళులర్పించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ 48వ డివిజన్ కార్పొరేటర్ కృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఆమె భర్త దయాసాగర్ రెడ్డిపాలెం గ్రామంలోని కృష్ణారెడ్డి నివాసానికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తాఫా, మద్దాళిగిరి, ఉండవల్లి శ్రీదేవి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, గుంటూరు పార్లమెంట్ జిల్లా ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి, డిప్యూటీ మేయర్లు డైమండ్ బాబు, షేక్ సజిల, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తదితరులు కృష్ణారెడ్డి పార్థివ దేహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పార్టీ జెండాను కృష్ణారెడ్డి పార్థివ దేహానికి కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఆయన 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని నాయకుడన్నారు. వార్డ్ మెంబర్‌గా, ఉప సర్పంచ్, సర్పంచ్‌గా కృష్ణారెడ్డి గ్రామానికి చేసిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎనలేనివని కొనియాడారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన ఏకైక కార్పొరేటర్ అని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కృష్ణారెడ్డి అకాల మృత్యువాతకు గురికావడంతో.. జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామానికి చేరుకున్నారు.



ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి నివాళి..



పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సుచరిత..

మంత్రి ధర్మాన సంతాపం..

కృష్ణారెడ్డి మృతికి రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణారెడ్డి అకాల మృతి ఎంతో భాదాకరమన్నారు. నీతి నిజాయతీలకు మారుపేరుగా కృష్ణారెడ్డి ఎంతో రాణించాడన్నారు. ఆయన అకాల మృతి తీవ్రదిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కృష్ణారెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



భౌతికకాయంపై పార్టీ జెండా కప్పుతున్న ఎమ్మెల్సీ లేళ్ల, మోదుగుల, ఇతర నేతలు



కృష్ణారెడ్డి అంతిమయాత్ర..

పేదల పాలిటి పెన్నిధి దామోదరం సంజీవయ్య

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్

గుంటూరు రూరల్: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఎంతో కృషిచేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంజీవయ్య 102వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. తన భర్త మేకతోటి దయాసాగర్, ఏఎన్‌యూ రిటైర్డ్ జాయింట్ రిజిస్ట్రార్ మాథ్యూస్‌తో కలిసి ఆమె సంజీవయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ.. పేద కుటుంబాల అభివృద్ధికి మహానేత సంజీవయ్య చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ భావితరాల భవిష్యత్తుకు, సమాజాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెన్యామన్, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, మండల కన్వీనర్లు, కార్పొరేటర్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు స్టేట్ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, పలు సొసైటీలు, ఏఎంసీల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

కాకుమాను: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని కాకుమాను జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. ఆలయ ట్రస్టు బోర్డు నియామకాల్లో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడంపై.. మంగళవారం నిర్వహించిన సమావేశంలో మండలంలోని నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ గుల్జార్ బేగం మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల క్షేమం కోరే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఆలయ వ్యవస్థల్లో అర్చకులతో పాటు నాయీ బ్రాహ్మణులకు విడదీయరాని బంధం ఉందని.. అది గుర్తించిన ముఖ్యమంత్రి పాలక బోర్డుల్లో వారికి అవకాశం కల్పించాలని చెప్పారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నాడు నాయీ బ్రాహ్మణులను దేవాలయాల ట్రస్టు బోర్డుల్లో సభ్యులుగా చేయాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుని కోరితే.. తోకలు కత్తిరిస్తాం, ఆలయాల మెట్లు కూడా ఎక్కనీయం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, కాకుమాను ఎంపీటీసీ–2 కానుగుల పరమేశ్వరరావు, పైనేని నవీన్, గొరిజవోలు రంగారావు, మెరిగల సుందరరావు, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు కలకోట కృష్ణ, గుంటుపల్లి వెంకటప్పయ్య, దూళిపూడి చైతన్య, చెన్నకేశవులు, పల్లెకోన రామకృష్ణ, మండలంలోని నాయీ బ్రాహ్మణుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఎం సోమశేఖర్‌కు సన్మానం



ఏపీఎంను సన్మానించిన ఉద్యోగ సంఘ నాయకులు

పెదనందిపాడు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న కాకుమాను ఏపీఎం తానికొండ సోమశేఖర్‌ని స్థానిక ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు మంగళవారం సన్మానించారు. పెదనందిపాడుకు చెందిన ఆయనను స్థానిక బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అభినందించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు మాట్లాడుతూ.. గత 12 సంవత్సరాలుగా ఏపీఎంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సోమశేఖర్ ఉత్తమ సేవలందించారన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడిద సుధాకర్, కట్టా రవికుమార్, బొనిగల రత్నకుమార్, తమలపాకుల సుబ్బారావు, పి.రాజమోహన్, మంద్ర మాణిక్యరావు కట్టా రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి కృషి చేయాలి



మంత్రి నాగార్జునకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: నగరంలోని ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరిందని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని పలు ప్రజా సంఘాల నేతలు రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు మంగళవారం నగర శివారులోని ఆయన క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి నాగార్జున ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి భవన నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. భీమ్‌భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ళ ప్రకాష్, పలు ప్రజాసంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, తాడికొండ నరసింహరావు, జొన్నలగడ్డ శ్రీకాంత్, బడికొళ విజయ్‌భాస్కర్, రావినూతల కమలకుమారి, షేక్ బాజీ, ఎర్రగుంట్ల సుజాతరావు, బంబ్లమూడి స్టాలిన్ తదితరులున్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కిలారి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, పక్కన జడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ

చేబ్రోలు: అభివృద్ధే ధ్యేయంగా మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు పనిచేయాలని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దిశా నిర్దేశం చేశారు. చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె.సాహితి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలోని అధికారులు, సిబ్బంది పనితీరుపైనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అలాగే మండల పరిధిలో 130 ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నట్లు మత్స్యశాఖాధికారిణి వెల్లడించారు. ఈ క్రమంలో చేపల పెంపకం పేరుతో వాతావరణం కలుషితం అవుతోందన్నారు. పరిసర మండలాల్లోని హోటల్స్, చికెన్ స్టాల్స్‌లోని వేస్ట్‌ను చెరువుల్లో వేస్తున్నారని.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వేజండ్ల, సుద్దపల్లి, శలపాడు, వడ్లమూడి గ్రామాల్లో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

కల్యాణ మండపం నిర్మాణానికి తీర్మానం

చేబ్రోలు జీబీసీ రహదారి పక్కన వైఎస్సార్ కళా ప్రాంగణంలో సుమారు రూ.30లక్షల వ్యయంతో కల్యాణ మండపం నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. చేబ్రోలు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనుల్లో మధ్యవర్తుల ప్రమేయాన్ని అరికట్టాలని ఎమ్మెల్యే హౌసింగ్ ఏఈకి సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి తగిన సూచనలు ఇవ్వాలని ఎంపీడీవోను ఆదేశించారు. నారాకోడూరు జడ్పీ హైస్కూల్ ఇంచార్జి హెచ్‌ఎం పనితీరుపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని సూచించారు. డీఈవోతో ఫోన్‌లో మాట్లాడారు. రెగ్యులర్ హెచ్‌ఎంను త్వరతగతిన నియమించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బి.అనూరాధ, ఎంపీపీ కె.సాహితి, వైస్ ఎంపీపీలు పసుపులేటి శ్రీనివాసరావు, కె.అనిత, ఎంపీడీవో బి.బాబురావు, ట్రైనీ స్పెషల్ కలెక్టర్ శివన్నారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి

ఫిరంగిపురం: మేరికపూడి వీఆర్‌ఏ టి.గంగయ్య(58)గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పద్మనాభుడు, సిబ్బంది గంగయ్య కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి ప్రభుత్వం తరుపున మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15వేల నగదు అందజేశారు.